వ్యక్తులతోటిగాని, బయట వస్తువులతోటిగాని అనుబంధం ఉన్నవాడికి స్వతంత్రమైన సుఖం తెలియదు. వైరాగ్యం అవలంభించి విషయవాసనలలోనుండి ఎవడైతే బయటపడ్డాడో వాడికి మాత్రమే ఆత్మసుఖం అందుతుంది. మీకు ఎవరికైనా సంపదలు ఉంటే వాటిని భోగాలకు ఉపయోగించవద్దు, వాటిని యోగానికి ఉపయోగించండి. పైన కిరసనాయిలు పోసి నిప్పుని ఆర్పటం ఎటువంటిదో కోరికలను నెరవేర్చుకొంటూ కోరికలను జయించటం కూడా అటువంటిదే. మీకు సినిమాకు వెళ్ళాలనే తలంపు వచ్చింది అనుకోండి సినిమాకు వెళ్ళి సినిమా చూసిన ఆనందం కంటే ఆ తలంపును నిగ్రహించుకోవటం వలననే ఎక్కువ ఆనందం, శాంతి మీకు వస్తుంది. బయట ఎక్కడైనా మురికిగుంటలు ఉంటే ఆ వాసన రాకూడదు అని ముక్కు మూసేసుకుంటారు. మరీ నీ లోపల ఉన్న మురికి గుంటల మాట ఏమిటి? అందులో నుండి బయటకు రావా. లోపల ఉన్న మురికి గుంటల నుండి బయటకు రావటం కష్టం, వాటిలో నుండి బయటకు రావాలంటే సాధనా బలం ఉండాలి, కాలం కలిసిరావాలి, గురువు అనుగ్రహం ఉండాలి. ఇవన్నీ కలిసివస్తే గాని లోపల ఉన్న మురికి గుంటలనుండి బయట పడలేము.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-12-2009, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు అరుణాచల దీపోత్సవం. పరమేశ్వరుడు బ్రహ్మవిష్ణువులకు జ్యోతిరూపంలో దర్శనమిచ్చిన రోజు. దానికి గుర్తుగా ప్రతీ సంవత్సరం ఇక్కడ జ్యోతి ప్రజ్వలన చేస్తారు. జ్యోతిని దర్శించినవారికి పుణ్యప్రదమని, జీవుడికి వికాసము కలుగుతుందని స్కాందపురాణములో చెప్పారు. ఈ గిరి జ్ఞానాన్ని ప్రసాదించే కొండ. అన్నామలై అంటే అందని కొండ. పరమేశ్వరుడు జ్యోతిరూపంగా వెలిసినప్పుడు బ్రహ్మవిష్ణువులు ఆయన ఆది అంతము తెలుసుకొనుటకు అహంకారముతో బయలుదేరారు కాబట్టి ఇద్దరికి అది అందలేదు. అందుచేత అహంకారము తోటి పరమేశ్వరుడిని కొలవలేము. మనస్సు ఉన్నవాడు మనస్సులేనివాడిని అర్థం చేసుకోలేడు. రాముడికి వసిష్ఠుడు గురువు, కృష్ణుడికి సాందీపులవారు గురువు, పరశురాముడికి దత్తాత్రేయుడు గురువు కాని రమణుడికి గురువు ఎవరూ లేరు. భగవాన్‌కి మరణానుభవం ద్వారా అరుణాచలేశ్వరుడు ఆయన హృదయంలో చైతన్యంగా వ్యక్తమయ్యాడు అప్పుడు భగవాన్‌కి గురువు అరుణాచలేశ్వరుడు. నమఃశ్శివాయ దీనిని పంచాక్షరీ అంటారు. అరుణాచలం దీనిని జ్ఞానపంచాక్షరీ అంటారు. అందుచేత అరుణాచలా అనుకున్నా సరిపోతుంది. ఎక్కడైతే దుఃఖ స్పర్శలేదో, ఎక్కడైతే అశాంతిలేదో, ఎక్కడైతే ద్వైతం లేదో, ఎక్కడైతే ఇష్టాయిష్టాలు లేవో ఆ స్థితికి

అంటే మహాచైతన్యంలోనికి జీవకోటిని మేల్కొలపటానికి వచ్చిన అవతారపురుషులు రమణుడు, బుద్ధుడు, రామకృష్ణుడు. నిజమైన అరుణాచలం మన హృదయంలో ఉంది, మనం అక్కడకు వెళ్ళాలి అనేవారు భగవాన్. జగత్తు, జీవుడు, దేవుడు మనో కల్పితమని చెప్పారు. నువ్వు సాధన చేసి రాగము, భయము, కోపము ఈ మూడింటిలోంచి విడుదల పొందు అర్జునా అని పరమాత్మ చెప్పాడు. ఈ మూడు ఎక్కడ ఉన్నాయో అక్కడ మనిషి కూడా నీడ వచ్చినట్లు అశాంతి వస్తుంది, కోపం వస్తుంది, భయం వస్తుంది ఇది తప్పదు.

కాశీలో మరణిస్తే ముక్తి, తిరువాయూరులో జన్మిస్తే ముక్తి, చిదంబరాన్ని దర్శిస్తే ముక్తి, అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి. వీటిలో తేలికైనది అరుణాచల స్మరణ. మన దేహం ఎక్కడ ఉన్నా అరుణాచలాన్ని స్మరించటం వలన పవిత్రులవుతాము. ఎవరైతే నిరంతరము అరుణాచలాన్ని స్మరిస్తున్నారో వారికి ఇంద్రియాలు నిర్మలమవుతాయి, మనస్సు నిశ్చలమవుతుంది. అప్పుడు వారి మనస్సు, ఇంద్రియాలు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తాయి. హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తే అక్కడ ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వస్తుంది. మనకి అరుణగిరి గుర్తుకు వస్తూ ఉంటే శాంతి వస్తుంది. మనకి ఇల్లు గుర్తుకు వస్తే మోహం వస్తుంది. పాములు మనుషుల మధ్య తిరగవు, ఎక్కడైతే మరుగు ఉంటుందో అక్కడే పాములు ఉంటాయి. అలాగే వైరాగ్యం ఉన్నవాడు విషయాల మధ్యలో ఉండకూడదు అని ఆచార్యులవారు చెప్పారు. వైరాగ్యం ఉన్నవాడు మనుషులతోటి ఎక్కువ సంబంధం పెట్టుకోవటం వలన లోకవాసన, దేహవాసన పెరిగిపోతుంది. ఈ వాసనలు మళ్ళీ మనస్సుని అంతర్ముఖం అవ్వనివ్వవు. అభ్యాసం వల్ల, వైరాగ్యం వల్ల మనస్సును లోపలకు పంపించి అన్వేషణ చెయ్యక పోతే, మనస్సు నిర్మలం అవ్వకపోతే కోటి జన్మలు ఎత్తినా మనకి ఆత్మజ్ఞానం కలుగదు. ఇది సిద్ధాతం. మనం బయటకు ఎంతదూరం అయినా వెళ్ళిపోతాము. కాని మనస్సుకి అంతర్దృష్టి కలగజేసి హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యటం, ఒక్క అంగుళం లోపలకు దిగటం చాలా కష్టంగా ఉంది. అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా, స్వాధ్యాయనం లేకుండా, సత్పురుషుల సహవాసం లేకుండా, దేవతల అనుగ్రహం లేకుండా, గురువు దయ లేకుండా ఒక్క అంగుళం కూడా మీరు లోపలకు దిగలేరు. మీరు గంటల తరబడి ధ్యానంచేసి ఒక అంగుళం లోపలకు వెళ్ళండి. అప్పుడు అంతర్ముఖంగా ప్రయాణం చేయుటం ఎంత కష్టమో మీకు అర్ధమవుతుంది. మోసేవాడికి బరువు తెలుస్తుంది కాని మోయనివాడికి బరువు ఎలా తెలుస్తుంది. మీరు ఎప్పడైనా సాధనలు చేస్తూ ఉంటే అందులో మెలకువలు తెలుస్తాయి. అందుకే భగవాన్ అన్నారు అందరూ గజఈతగాళ్ళే కాని ఎవరూ గజం కూడా కదలటంలేదు అన్నారు.

నీకు ఎంతవరకూ అవకాశం ఉందో అంతవరకు ధర్మాన్ని ఆచరించు. ధర్మాన్ని ఆచరించే

విషయంలో అజాగ్రత్త పనికిరాదు. ఆచార్యులను సేవించు. నీ తల్లిదండ్రులు మంచివారా, చెడ్డవారా అనేది నీకనవసరం. ఈశ్వరుడు చెప్పాడు కాబట్టి వారిని సేవించు, భగవంతుడు ముఖంలోంచి వచ్చినమాట శాస్త్రం, అందుచేత శాస్త్ర అధ్యయనం విషయంలో అశ్రద్ధ పనికిరాదు. సజ్జన సహవాసం విషయంలో అశ్రద్ధ పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు, సోమరి తనం పనికిరాదు. ఈ విషయాలు అన్నింటిలో మెలకువగా ఉంటే ఇవన్నీ అంతర్ముఖంగా ప్రయాణం చేయటానికి నీకు సహకరిస్తాయి. మనం ఎక్కువగా నేను, నేను అంటున్నాము. ఇది దేహగతమైన నేను. ఈ నేను చుట్టూ తిరిగేవాడు ప్రతీవాడు మూర్ఖుడే. వాడికి చివరికి మిగిలేది జ్ఞానము కాదు మూర్ఖత్వం మిగులుతుంది. జీవలక్షణాలు అతిక్రమించకుండ, ప్రకృతి లక్షణాలు అతిక్రమించకుండ ఎవరూ చైతన్యంలో ఐక్యం కాలేరు. నీ జీవలక్షణాలు పోగొట్టటమే నా పని అంటున్నాడు అరుణాచలేశ్వరుడు. సముద్రం చైతన్యం అందులో ఉన్న చిన్న బుడగ జీవుడు. ఆ బుడగ పగిలిపోతే సముద్రం అవుతుంది. ఆ బుడగ బుడగగా ఉంటే సముద్రం అవ్వదు. ఆ బుడగని అంటే జీవుడిని చైతన్య సాగరంలో కలిపేసుకున్నాడు అరుణాచలేశ్వరుడు. అప్పుడు అంతా చైతన్యమే. నిజమైన నేనుకి హద్దులు లేవు, మిధ్యానేనుకి హద్దులు ఉన్నాయి. మీరు అందరూ నా లోపల ఉన్నారు, నేను మీ లోపల లేను అన్నాడు పరమాత్మ. అంటే మీ జీవలక్షణాలలో, మీ ఇష్టాయిష్టాలలో, మీ పరిమితులలో నేను లేను అని చెప్తున్నాడు. ఈనాటికి అయినా, ముందునాటికి అయినా మీరు అందరూ నాలో ఐక్యం కావలసిందే. వర్షపునీరు ఎక్కడ నుంచి ఎక్కడ నుంచో ప్రవహించి చివరకు సముద్రంలో కలవవలసిందే. అలాగే ప్రారబ్ధవశాత్తు మీరు ఎన్ని జన్మలెత్తినా చివరకు హృదయగుహలోనికి చేరుకోవలసిందే. మన శరీరం ఎంత నిజమో మన ఇల్లు కూడా అంతే నిజం. మన నిజమైన ఇల్లు మన హృదయం.

ప్రతీమనిషికి ఆనందం కావాలి. నాకు ఆనందం వద్దని ఎవరూ చెప్పరు. ఆనందం ఎక్కడ ఉంది? అక్కడకు ఎలా వెళ్ళాలి అని ఎవరూ తెలుసుకోవటం లేదు. ప్రపంచంలో ఏ వస్తువులో ఆనందం లేదు. ఆనందం అనేది నీ ఆధ్యాత్మిక హృదయంలో ఉంది. ఆధ్యాత్మిక హృదయం ఎక్కడ ఉంది అంటే నీకు నేను అనే తలంపు ఉంది. ఆ నేను అనే తలంపు బయటనుంచి రావటం లేదు నీ లోపలనుంచే వస్తోంది. ఆ నేను అనే తలంపు మూలమే ఆధ్యాత్మిక హృదయం. అక్కడే చైతన్యం ఉంది, అక్కడే ఈశ్వరుడు ఉన్నాడు. అక్కడకు చేరితే నువ్వు ఆనంద సముద్రంలో ఊగిసలాడతావు. అప్పుడు నీ మనస్సు, ఇంద్రియాలు కదలమంటే కదలవు. విషయాలకంటే విషమే మెరుగు అన్నారు ఆచార్యులవారు. ఎందుచేతనంటే విషం పేరు వింటే ఎవరూ చనిపోరు. విషం నోట్లో పోసుకుంటే చచ్చిపోతారు. దానివలన ఆ

శరీరం పోతుంది అంతే. కాని విషయాలను నోట్లో వేసుకోనక్కరలేదు. విషయాలను స్మరిస్తే చాలు అవి అనేక నీచజన్మలకు కారణం అవుతాయి. విషయచింతన వల్ల మనకి విషయాలమీద కోరిక కలుగుతుంది. ఆ కోరిక తీరకపోతే కోపం వస్తుంది. కోపం వస్తే వివేకం కోల్పోతాము. వివేకం కోల్పోతే బుద్ధిపాడైపోతుంది. నీ బుద్ధి పాడైపోయిన తరువాత నీకు ఎన్ని ఉన్నా ప్రయోజనం ఏమిటి? మనం చైతన్యం దగ్గరకు వెళ్ళటానికి మన బుద్ధి మనకి సహకరించాలి. ఆ బుద్ధిని వివేకవంతం చేయాలి. బుద్ధిని సూక్ష్మం చెయ్యాలి. నీ బుద్ధిని బాగు చేసుకోవటం కంటే మించిన పని అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు. మీరు లోకంలో ఏదైనా మంచి చెయ్యండి, మంచి మాట్లాడండి, మీరు సమాజానికి ఎంతోకొంత ఈగోలెస్‌గా ఉపయోగపడండి వీటి అన్నింటి ప్రయోజనం బుద్ధిని బాగుచేసుకోవటానికే. నీ ఇంపెర్సనల్ బిహేవియర్ వల్ల నీ బుద్ధి బాగుపడుతుంది కాని నీ దేహగతమైన నేను వల్ల నీ బుద్ధి బాగుపడదు. ఓ అరుణాచలేశ్వరుడా నిన్ను పట్టుకున్నాను నీ రూపాన్ని సపోర్టుగా పెట్టుకొని నిన్ను ఎంజాయ్ చేస్తున్నాను నువ్వు ఏమి చేసావంటే నేను వేరుగా ఉండి నిన్ను చూడటానికి వీలు లేకుండా నన్ను నీలో ఐక్యం చేసేసుకొన్నావు, నా కొంప ముంచేసావు. నా వ్యక్తీభావన తీసేసావు. దేవుడు వేరు, నేను వేరు అనే భావనని తినేయటానికే నువ్వు ఇక్కడ అవతరించావు అరుణాచలేశ్వరుడా అన్నారు.

ఈశ్వరుడు ఉన్నాడా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఉన్నవాడు ఆయన ఒక్కడే అన్నారు భగవాన్. అంటే మనం లేము అని అర్థం. మనం ద్వైతభావనలోంచి అద్వైతభావనలోకి రావాలి. నీ ప్రారబ్దంలో ఏది ఉంటే అదే వస్తుంది ప్రతీ దానిని అడగవద్దు అని భగవాన్ చెప్తున్నారు. మనం అడగకపోతే ఈశ్వరుడు ఇవ్వడేమో అనుకుంటాము. కోరికకి శక్తి లేదు. శక్తి ఈశ్వరుడిది. నువ్వు స్వప్నావస్థలోంచి జాగ్రదవస్థలోకి రాగానే ఆ స్వప్నావస్థ నీకు అసత్యం అని తెలుస్తుంది. అలాగే నీ హృదయంలో సద్వస్తువు ఉంది ఆ స్వదస్తువులోకి ఎవరైతే మేల్కొన్నారో ఆ మేల్కొన్నవాడికి ఈ జాగ్రదవస్థ కూడా అసత్యం అని తెలుస్తుంది. నీ దేహానికి అతీతంగా, నీ మనస్సుకి అతీతంగా, లోకానికి అతీతంగా నీ హృదయంలో ఒక సద్వస్తువు ఉంది అది మనకి తెలియటంలేదు. దానిని తెలుసుకోవటమే జీవితగమ్యం. ఆ సద్వస్తువును తప్పించి నువ్వు ఏది సాధించినా అన్నీ మనోకల్పితములు. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ నీకు శాంతిలేదు, సుఖంలేదు, ఫ్రీడమ్ లేదు. మనందరికి ఉండాలని ఉంది చనిపోవాలని లేదు. ఆ ఉండటమే దేవుడు. దేహం లేకపోయినా, మనస్సే లేకపోయినా, లోకం లేకపోయినా, దేవతలు లేకపోయినా వీటితో సంబంధం లేకుండా నువ్వు

ఉన్నావు. ఆ ఉండటమే దేవుడు. ఆ ఉండటమనేది నీ హృదయంలో ఉంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే నీ జీవితగమ్యం. మిగతావి నువ్వు ఎన్ని సాధించినా స్వప్న సమానం. మనం కోరి తెచ్చుకున్నవన్నీ మనలను బంధిస్తాయి. మనం కాళ్ళు బాడి చేసుకోవటం మళ్ళీ కడుక్కోవటం మనకి ఇంకో పని లేదు. మనకి ఒక కోరిక నెరవేరితే ఇంకొక కోరిక వచ్చేస్తుంది. మనకి ఏది మంచిదో, మనకి ఏది శ్రేయస్కరమో, మనకి ఏది జ్ఞానాన్ని ప్రసాదిస్తుందో మనకంటే ఈశ్వరుడికి బాగా తెలుసు. కాబట్టి నువ్వు ఇంక అడగటం ఎందుకు? మనం తెలివైనవాళ్ళము అని అనుకుంటాము. నాలుగు మొట్టికాయలు తగిలేవరకూ అలా అనుకుంటాము. మనకంటే దేవుడు వివేకవంతుడు, మనం భగవంతుడిని ఏదైనా అడిగితే ఇచ్చాను అంటాడు. మళ్ళీ అందులోంచి విడుదల పొందటానికి సాధన చేయాలి. మనం ఏదైతే లేదో అది కోరుకుంటాము అది వచ్చాక తెలుస్తుంది అందులో ఏమీ లేదని. మనలో బలహీనతలు ఉన్నంతసేపు మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళటం తప్పదు. నీ మనస్సు చలిస్తూ ఉందంటే నీకు లోపల ఏదో వాసన ఉంది.

ఓ అరుణాచలేశ్వరుడా! నిన్ను అనుభవంలోనికి తెచ్చుకోవటానికి నాలో ఏదైనా చెడ్డ ఉంటే ఆ చెడ్డ నువ్వు కోసేసి నన్ను అక్కడ వదిలేయకు, కళ్యాణగుణాలతో నింపు. మంచిగుణాలు, చెడ్డగుణాలు కూడా మనస్సే కాని నిన్ను తెలుసుకోవటానికి ఆ కళ్యాణగుణాలు ఉపయోగపడతాయి. నిన్ను తెలుసుకున్నాక ఆ కళ్యాణ గుణాలు కూడా పక్కకు తప్పుకుంటాయి. ఓ అరుణాచలేశ్వరుడా నువ్వు నాకు గురువుగా ఉండు. ఆనందం ఎక్కడైతే లేదో అక్కడ భక్తులుచేత వెతికించటం, అన్వేషణ చేయించటం అది గురువు చేసే పని కాదు రాక్షసుడు చేసేపని. ఎక్కడైతే శాంతి స్థానము ఉందో, ఆనంద స్థానము ఉందో అక్కడకు నీ మనస్సును, నీ ఇంద్రియాలను మళ్ళించేవాడే గురువు. నీకు రైట్ డైరెక్షన్ చూపించేవాడే గురువు, మనకి మంచి బుద్ధిని ప్రసాదించేవాడే గురువు. జిడ్డు కృష్ణమూర్తిగారు గురువు అవసరంలేదని చెప్తున్నారు అని ఒకరు వచ్చి భగవాన్‌తో చెప్తారు. ఆయనకు గురువు అవసరం లేకపోవచ్చు ఇతరులకి ఎవరికి గురువు అవసరంలేదని ఆయనకు ఎలా తెలుసు అన్నారు భగవాన్. ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వు పైకి రాళ్ళగుట్టకింద కనిపిస్తున్నావు, కొండలా కనిపిస్తున్నావు కాని నువ్వు జ్ఞానసముద్రుడవు, కృపాసముద్రుడవు, దయాసముద్రుడవు. మన దగ్గర నుంచి ఏమీ ఆశించకుండా హృదయగుహలోకి పంపించే గురువు ఆయన. గురువు ఏ స్థాయిలో ఉన్నాడో భక్తులు కూడా ఆ స్థాయిలోకి వెళ్ళేవరకూ వారిని విడిచిపెట్టడు. బోయవాడు జంతువును ఎలా వెంటాడుతూ ఉంటాడో అలాగ మీ శరీరం చనిపోయి ఇంకో జన్మలోకి

వెళ్ళినా సరే మిమ్మల్ని వెంటాడుతూ ఉంటాడు. వాడు గురువు. ఆచార్యులవారికి పద్మపాదుడికి కాశీలో మణికర్ణికాఘాట్‌లో వారిద్దరికి స్నేహం కలిసింది ఆ స్నేహం చనిపోయేవరకు అలాగే ఉంది. అది మైత్రి. వారిది జన్మాంతర అనుబంధం. కృష్ణుడు లాస్ట్ మినిట్‌లో అయినా దుర్యోధనుడితో స్నేహం వదిలెయ్యమని కర్ణుడికి చెప్తాడు. నువ్వు చెప్పినట్లు దుర్యోధనుడు మంచివాడు కాకపోవచ్చు అయినా నాకు రాజ్యము లేనపుడు రాజ్యము ఇచ్చాడు, నాకు సింహాసనం ఇచ్చాడు, నన్ను ఆయనతో సమానంగా కూర్చోబెట్టు కునేవాడు. ఈ క్లిష్ట సమయంలో విడిచిపెట్టిరావటం ఇది స్నేహ ధర్మమా! నా తల తీసేసినా స్నేహం విడిచిపెట్టను అన్నాడు. వాడు కర్ణుడు. అది మైత్రి. భగవాన్ అరుణాచలం వచ్చి తనను తాను అరుణాచలేశ్వరుడికి అర్పించుకున్నాక ఇంక ఆయనకి ఎప్పుడూ వేవరింగ్ రాలేదు. అరుణాచలం విడిచిపెట్టి కాశీ చూచివద్దాము, రామేశ్వరం చూచివద్దాము అనే తలంపు కూడా ఎప్పుడూ రాలేదు. అది జన్మాంతర అనుబంధం. అరుణాచలాన్ని స్మరిస్తూ ఉంటే ఆయన నీ దేహాన్ని చంపడు, ఈ దేహం నాది అనే తలంపుని చంపేస్తాడు. ఇది చంపక చంపెడు మందు. మీరు అరుణాచలం సరదాగా వచ్చిన ఆయన చెయ్యవలసిన పని ఆయన చేసేస్తాడు. ఈ అరుణాచలాన్ని దర్శించిన వాడు ఒట్టి చేతులతో వెళ్ళడు. నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు, ఆస్తికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు. మీ తలంపుతో సంబంధం లేకుండా అరుణాచలేశ్వరుడు రహస్యంగా చేసుకువెళ్ళిపోతూ ఉంటాడు. ఆయన స్వభావం అది. అరుణాచలేశ్వరుడు ఆనందం ఇస్తాడు అని నేను ఇతరులకు చెప్పటం కూడా నీకు ఇష్టం ఉండదు. అయినా నేను చెబుతున్నాను నీకు ఇష్టం లేని పని నేను చేస్తున్నాను కాబట్టి నన్ను క్షమించు అరుణాచలేశ్వరుడా అంటారు భగవాన్.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 13-12-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకుంటూ మిగతా టైములో సాధన చేసుకోండి. మనం పొందవలసిన స్థితి ఏదో శరీరం జీవించి ఉండగానే పొందాలి. మనం భగవదనుభవం పొందాలి. మనం మరణానంతరం వెడితే మంచి లోకాలకు వెడతాము లేకపోతే చెడ్డలోకాలకి వెడతాము కాని సాధనలోకాలకి వెళ్ళము. ఈ భూమి మీదే మనం సాధన చేసుకోవాలి. అందుచేత మీరు కాలాన్ని వృధా చేసుకోవద్దు. మనకు అన్ని అవకాశాలు ఉన్నా, బీదవారు ఎలా బతుకుతున్నారో అలా మనం బతుకుతూ ఉంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. బీదవాడు బట్టలలో నిరాడంబరంగా ఉంటాడు. వాడు అన్నం ఏదో సరిపడ తింటాడు